# పండుటాకు

- డి.ఆర్.ఇంద్ర.



'మీ కాలేజి టైమవుతోంది, ఇంకా తెమలరా?'

మీసాల కత్తెర చేతపట్టి అరగంట నుండి అద్దం ముందు నిలబడి ముఖం చూసుకుంటూన్న ఆనందరావు నుద్దేశించి వంటింట్లోంచి కోమలి రెండోసారి గట్టిగా హెచ్చరించింది. ఆనందరావు ఉలకలేదు, పలకలేదు. అద్దంలో తన ప్రతిబింబాన్ని తదేకంగా చూస్తున్నాడు. పెళ్లిచూపులకి తయారయ్యే ఆడపిల్ల అద్దం ముందు గడిపే సమయం కన్నా చాలా ఎక్కువసేపే ఈమధ్య ఆనందరావు అద్దం ముందు గడుపుతున్నాడు. జొన్న చేలో దాగిన దొంగని వెనక నుండి పీక పట్టుకుని లాక్కొచ్చినట్టు మీసాల్లో దాగిన తెల్ల వెంట్రుకల్ని మొదలంటూ కత్తిరిస్తున్నాడు.

ఆనందరావుకి ఈమధ్యే నలభై తొమ్మిది వచ్చింది. యాభై వచ్చేస్తున్నాయన్న దిగులు కన్నా, అతనికి జుట్టు నెరిసిపోవడం, చెంపలు నెరవడం, మీసాలు తెల్లబడటం ఎక్కువగా బాధ కల్గిస్తున్నాయ్. తెల్ల క్రాపూ, వెండి చెంపలూ, తెల్ల

మీసాలూ చూసుకుని భరించలేకపోతున్నాడు. ఓ మిత్రుడి సలహాలకి టీవీ ప్రకటనలు తోడై కొన్నాళ్లుగా హెయిర్‌డై వాడటం మొదలుపెట్టాడు. జుత్తుకి నలుపు రంగు రాసిన వారం రోజుల వరకూ ఫరవాలేదు కానీ కుదుళ్లలోంచి మళ్లా తెలుపు కలుపులా మొదలవుతూంది. తలకీ, చెంపలకీ హెయిర్‌డై వాడుతూ తెల్ల వెంట్రుకల్ని కవర్ చేస్తున్నా, తెల్లబడుతున్న మీసాల్ని ఏం చేయాలో తెలిసేది కాదు. నల్ల క్రాఫ్‌కి తెల్ల మీసాల కాంబినేషన్ కుదరక, ఇన్‌ఫార్మర్ ఇంట్లో దాక్కున్న నక్సలైట్లని పోలీసులు చుట్టుముట్టి పట్టుకుని కాల్చిపారేసినట్టు తెల్ల మీసాల వెంట్రుకల్ని పట్టి కత్తిరించి పారేస్తుంటే వెంట్రుకల మధ్య గ్యాప్ వచ్చి అసహ్యంగా కన్పించడంతో, మీసాలకీ నల్లరంగు వెయ్యడం మొదలుపెట్టాడు గానీ, ఆ హెయిర్‌డై వాసన వికారపెట్టడం భరించలేకపోయాడు. పోనీ మీసాలు మొత్తంగా తీసేద్దామా హిందీ హీరోల్లా అనుకున్నాడుగానీ చిగురు కొంచెం ఎత్తు అవడంతో మీసాలు తీసేస్తే హనుమంతుడి మూతిలా కనిపిస్తుందేమోనని భయపడి మళ్లా కత్తెర చేతపట్టి తెల్ల వెంట్రుకల వేట మొదలుపెట్టాడు. ఈ హెయిర్‌డైలూ గట్రా అవసరం లేకుండా జుట్టునీ, మీసాల్నీ శాశ్వతంగా నల్లగా ఉంచే మార్గం ఏదీ లేదా అని ఈమధ్య తెగ ఆలోచిస్తున్నాడు. కానీ తన ఆలోచనల్ని కోమలి పరిహసిస్తుంది. తను గంటల తరబడి గడపడాన్ని కోమలి విసుక్కుంటోంది.

వయసు మీద పడుతూంటే తలా, గెడ్డాలూ, మీసాలూ నెరవడం సహజం. తెల్లబడ్డాయని బాధపడిపోయి, తెల్ల బొచ్చుకి నల్ల రంగేసి ఇంకా రంగేళీ రాజాలా కనిపించాలని తాపత్రయం ఎందుకూ అంటుంది. కానీ తన బాధేవిటో కోమలికి ఏం తెలుస్తుంది? తలా, చెంపలూ నెరిసేసరికి నలభై తొమ్మిదేళ్లకే షష్టి పూర్తి అయినవాడి వాటం వచ్చేసినట్టు అనిపిస్తోంది. ఇంకా తెల్లబడని నల్ల వెంట్రుకలు రోజూ- మేవూ తెల్లబడ్డూ నిన్ను ముసలాడ్ని చేసేస్తాంలే అని బెదిరిస్తున్నట్టు ఉంటుంది అద్దంలో చూస్తూంటే. తనకి ముసలి రూపుని ఇచ్చే అవకాశం ఈ వెంట్రుకలకి తనిస్తాడా. దట్టంగా నలుపు రంగు పులిమి మీ దిక్కున్నచోట చెప్పుకోండి అని తనే వాటిని వెక్కిరిస్తాడు. ఈ తెల్ల వెంట్రుకల మీద నల్ల రంగుతో యుద్ధం చేయాల్సిందే. కానీ యుద్ధం వద్దు అంటుంది వెర్రి కోమలి!

కోమలి అంటే తనకి పంచ ప్రాణాలు. తనంటే కోమలికీ వెర్రి ప్రేమ. అన్ని విషయాల్లోనూ తనకి సహకరించే కోమలి ఈ విషయంలో మాత్రం వ్యతిరేకిస్తోంది. కోమలికి నలభై ఏళ్లకే తల బాగా నెరిసింది. హెయిర్‌డై వాడమంటే నిరాకరించింది. హెయిర్‌డై వాడకపోతే నా పక్కన నువ్వు నా భార్యలా కాక నాకు అప్పలా కనిపిస్తావ్ అన్నాడు ఓసారి కోపంగా. మరేం ఫర్వాలేదు. ఆడది మొగుడికి ఒక్క భార్య మాత్రమే కాదు- అప్పా, చెల్లీ, తల్లీ కూడా అంది తన మాటని కొట్టిపారేస్తూ. కోమలిని తను మాటల్లో జయించలేడు.

'వయసు మీరడం మనుషులకీ, జంతువులకీ సహజమే, సమానమే. మీద పడుతూన్న వయసుని దాచేస్తూ ఇంకా యవ్వన దశలోనే ఉన్నట్టు కనిపించడానికి ఏ జంతువూ ప్రయత్నించదు. మనిషీ ఓ జంతువేగా. ఇతర జంతువులకి లేని ఈ తాపత్రయం మనిషికెందుకూ? తాపత్రయాలు మనసు పరిధిని కుంచింప చేస్తాయి' అంటుంది కోమలి. మనిషికీ జంతువుకూ పోలికా? తను విస్తుపోతాడు. మనిషికి ఉన్నట్టుగా తమ అందం గురించిన స్పృహ జంతువులకి ఉంటుందా? నెమలికి తను అందమైన దాన్ననే ఊహ ఉంటుందా? హైనాకి తను కురూపి అనే ఊహ ఉంటుందా? ఇతర ప్రాణుల ఊహల్లో అందం అంటే ఏమిటి? ఎంత చిత్రమైన ప్రశ్నలు!

జుత్తు నెరవడం సహజం. సహజ విషయాల్ని సహజంగా అంగీకరిస్తే బాధ ఉండదు. ప్రకృతి నియమాల్ని ధిక్కరించి అసహజమైన హెయిర్‌డైలు వాడి కుర్రతనాన్ని ఫీలవడం బుద్ధిహీనత, ఇమ్మెచ్యూరిటీ అంటుంది కోమలి. అక్కడితో ఆగదు. ఇంకా-

పండువెన్నెల తెల్లదనాన్నీ, శీతాకాలపు తెల్లమబ్బుల్నీ, సముద్ర కెరటాల పాలనురగల తెలుపునీ ఆహ్లాదంగా ఆస్వాదిస్తాం. వెంట్రుకల

తెల్లదనం ఎందుకు వ్యథ కలిగించాలి? తెలుపు శుభసూచకం అని భావిస్తాం. నలుపు తెలుపు అవడం అంటే చీకట్లోంచి వెలుతురులోకి రావడం అని ఎందుకు అనుకోరూ అంటుంది. కోమలి పదునైన ప్రశ్నలకి సమాధానాలు తన దగ్గర లేవు. అయినా ఓటమిని అంగీకరించలేక ఉక్రోషంతో- ఇలా అయితే ఇంక నీతో కాపురం చేయనంతే అన్నాడు బెదిరింపుగా. మరీ మంచిది. ఇపుడు మనం కాపురం చేసి ఇంకా పిల్లల్ని కనాలా ఏమిటి, మనవలు పుట్టుకొచ్చే టైమైంది అంది కవ్వింపుగా.

'పెళ్లికూతుర్లా ఇంకా అద్దం ముందు ఎంతసేపూ?' వంటింట్లోంచి కోమలి మళ్లీ హెచ్చిరించింది.

'ఎంతసేపు అయితేనేం? ఇవాళ ఆదివారం అని మరిచిపోయావా?' కత్తెర టకటకలాడిస్తూ చెప్పాడు.

'ఔనా? సెలవు అనేదే లేని గృహిణికి ఆదివారం స్పృహ ఎలా ఉంటుందిలే! అయితే దొడ్లో చెట్టుకింద కూర్చుని ఎండలో పెట్టిన వడియాలు కాకులెత్తుకుపోకుండా కాసేపు కాపలా కాయండి. ఆ తర్వాత తలకి రంగేసుకోవచ్చు' చెప్పింది కోమలి.

కోమలి ఆజ్ఞాబద్ధుడై దొడ్లో మామిడిచెట్టు కింద ఓ కొమ్మకి హేంగింగ్ కేన్ ఛైర్ తగిలించి కూర్చుని వడియాల కాపలా సంగతి కాకులకి వదిలేసి ఇంగ్లీషు నవలొకటి చేతపుచ్చుకున్నాడు. క్షణం గడిచిందో లేదో, మావిడాకులు నెత్తిమీదా, పుస్తకంమీదా రాలడంతో చిరాగ్గా తలెత్తి చూశాడు. వేసవికాలం అవడం వల్ల ఆకులు బాగా ముదిరి పండబారి గాలికి ఒకటొకటిగా రాల్తున్నాయ్. ఆకులు తీసిపారేసి మళ్లీ పుస్తకంలో తలదూర్చాడు. మళ్లీ ఆకులు మీద పడ్డాయ్. మళ్లీ తీసేసి పుస్తకంలో పడ్డాడు. ఆకులు మళ్లీ పడ్డాయ్. తలెత్తి చూశాడు. ఆకులు రాలుతూనే ఉన్నాయ్. కొద్దిక్షణాల తర్వాత ఆనందరావు పుస్తకం మూసేసి రాలుతున్న ఆకులవంకే చూస్తూ చాలాసేపు గడిపాడు.

సాయంత్రం ఇద్దరూ కల్సి ప్రిన్సిపాల్ ఇంటికి టీపార్టీకి వెళ్లాల్సిన సంగతి గుర్తుచేస్తూ-

'అదేం! రంగు వేసుకోలేదేం?' అంది కోమలి విస్తుపోతూ.

'ఇంక రంగు వెయ్యను!' ప్రశాంతంగా చెప్పాడు టీపార్టీకి వెళ్లడానికి సిద్ధమవుతూ.

'ఏమైంది మీకివాళ?' ఇలా తెల్ల జుట్టూ, తెల్ల మీసాలతోనే పార్టీకి వస్తారా? నమ్మలేనట్టుగా అడిగింది కోమలి.

'నాకేమీ అవలేదు. వచ్చాక చెప్తాలే, పద' అన్నాడు ఆనందరావు సాదాసీదా దుస్తులు ధరించి.

అప్పటివరకూ బాలాకుమారుడులా టిప్‌టాప్‌గా, సూటూబూటూతో కనిపించే ఆనందరావు ఇపుడు హఠాత్తుగా వెండిలా నెరిసిన జుట్టూ, చెంపలూ, తెల్ల మీసాల్తో, లాల్చీ పైజమాలో ఎవరో అపరిచిత పెద్దమనిషిలా కనిపించడంతో కొలీగ్స్ మొదట గుర్తుపట్టలేదు. గుర్తుపట్టాక చాలా వింతగా చూశారు. కానీ ఆనందరావు మాత్రం అదేమీ పట్టించుకోనట్టు ప్రవర్తించడం గమనించింది కోమలి.

◆ ◆ ◆

ఆ రాత్రి డాబాపై వెన్నెట్లో కోమలి-

'ఇపుడు చెప్పండి మహానుభావా! హఠాత్తుగా సంసారం వదిలేసి సన్యాసం పుచ్చుకున్నట్టు ఇంత హఠాత్ మార్పేవిటి మీలో?' ఆనందరావ్ వెండి చెంపల్ని నిమురుతూ అడిగింది.

'ఒకోసారి చాలా కాకతాళీయంగా జరిగే సంఘటనలు జీవితంలో ఆశ్చర్యకరమైన మార్పులు తీసుకొస్తాయేమో! నువ్వు మావిడిచెట్టు

## కొత్త చీర

భూతల్లి సింగారాలకేం తక్కువ
ఫ్యాషన్ మారినప్పుడల్లా
కాలపు నేత కార్మికుడు
కొత్త చీర చుడుతుంటేను...?!

- అయినంపూడి శ్రీలక్ష్మి.

కింద కూర్చుని వడియాలు కాపలా కాయమని ఆదేశించావుగా. నీ ఆజ్ఞ ప్రకారం చెట్టుకింద పుస్తకం పట్టుకుని కూర్చున్నాను. నెత్తిమీద ఆకులు రాలుతుంటే మొదట చిరాకుపడ్డాను. కానీ అలా అదేపనిగా ఒకటొకటిగా రాలుతున్న ఆ పండుటాకుల్ని చూస్తున్నకొద్దీ క్రమేపీ నా చిరాకు మాయమై ఏవేవో చిత్రమైన ఆలోచనలు రేకెత్తాయ్. బాగా పండబారిన ఆకులు చిరుగాలికి గలగలా చప్పుడు చేస్తూ దిగుతున్న విమానంలా తమాషాగా నేలవాలడాన్ని చూడటం ఆనందంగా అనిపించి పుస్తకం మూసేశాను. అలా చూస్తుంటే ఆకు రాలడంలో గొప్ప వయ్యారం, సొగసూ ఉన్నాయనిపించింది. బాగా ఎదిగి ముదిరి పండబారి నేలరాలుతున్న ఒక్కో ఆకూ ఒకప్పుడు తాకితే కందిపోయే లేత చిగురుటాకే! ఆ లేత చిగురుటాకు పండి రాలేలోపు ఎన్ని దశలు దాటింది! చెట్టుమీద కొమ్మల్లో చిటారు రెమ్మల్లో పుట్టినా, తన చివరి వయ్యారాలు పోతూ రాలింది! ఎప్పటికీ ముదరకుండా లేత చిగురుటాకులాగే చెట్టుని అంటిపెట్టుకునే ఉండాలనే దురాశ ఆకుకి లేదు. కానీ ఎపుడూ యవ్వనవంతుడులాగే కనిపించాలని తాపత్రయపడే నాలాటి అల్పబుద్ధులు ఆ ఆకు కన్నా తక్కువే కదా అనిపించింది ఆ క్షణంలో. జారిపోతున్న వంటి బిగువునీ, రూపునీ కృత్రిమంగా ఆపాలని భావించే నాలాటివాళ్ల దురాశల పునాదుల మీద ఆధారపడే కదా కాస్మెటిక్ ప్రపంచపు వేల కోట్ల రూపాయల అనవసర వ్యాపారం జరుగుతోంది!

ఆకుపచ్చతనం నుండి పసుపు వర్ణంలోకి మారుతున్న తన ఆకుల్ని చూసి చెట్లు దిగులుపడవు. కానీ నెరుస్తున్న తన వెంట్రుకల్ని చూసి పుట్టి మునిగినట్టు మనిషి దిగులుపడటం ఎంత మూర్ఖత్వం అనిపించింది. చెట్టు దృష్టిలో లేత చిగురుటాకు ఎంత అందమైనదో, పండబారి రాలుతున్న ఆకూ అంతే అందమైనది కాబోలు. ఆకులు రాలిపోతున్నా, నిర్వికారంగా వుండే చెట్టుని చూసైనా మనిషీ జుట్టు నెరస్తేయేం , బట్టతలైతేయేం, అంతే నిర్వికారంగా ఉండలేడా అనిపించింది. జుట్టు నెరవడం జుట్టుకి సంబంధించిన సమస్య కాదనీ, నా అపరిపక్వ మనసుకి చెందిన సమస్య అనీ అర్థమైంది. యవ్వనం ఎంత గొప్ప దశో, వృద్ధాప్యమూ అంతే అపురూపమైన గొప్ప దశ అనీ, యవ్వనం మరుగవుతూ, శరీరం ముడతలు పడుతుంటేయేం, మనసులోని ముడతలు విడివడి, అంతర్దృష్టి విశాలమై సత్యాన్వేషణ చేయగలిగే పరిపక్వతని వృద్ధాప్యం ప్రసాదిస్తుందని గతంలో చెప్పావ్. కానీ నేనే తెలివితక్కువగా అర్థం చేసుకోలేకపోయాను. ఇపుడు కుర్రచేష్టలు మాని వయసుకు తగ్గట్టు హుందాగా ఉండాలనిపించింది. అందుకే కృత్రిమ వేషాలకి స్వస్తి చెప్పేశాను'.

కోమలి అతనివంక అపురూపంగా చూసి కోమలంగా నవ్వింది.

'ఆనందూ! పాతికేళ్ల క్రితం మన పెళ్లిచూపుల రోజుకన్నా, మన తొలిరాత్రి కన్నా, ఇపుడే ఎన్నో రెట్లు నవమన్మధుడిలా కనిపిస్తున్నావ్! నీలోని కుర్రతనాన్ని ఈ వెన్నెల రాత్రి ఊరకే పోనిస్తానా?' ఆనంద్ వెండి క్రాఫ్‌ని దువ్వుతూ అతని పెదవుల్ని తన పెదవుల్తో సీల్ చేసేస్తూ అల్లుకుపోతూ చెప్పింది కోమలి.

డాబాపైకి విస్తరించిన మామిడి కొమ్మలు నవ్వుతూ ఊగుతున్నాయ్. ❑

## వంతెనలు

సత్తుగిన్నెలు విడిపించుకోడానికి
సత్యహరిశ్చంద్రుడిలా ప్రవర్తించనా?
సిటీ బస్సులో నా పెళ్ళాం మోచెయ్యి
సాటి ప్రయాణికుడికి తగిలిందేమోనని
శ్రీరామచంద్రుడిలా శంకించనా?

పురాణ పురుషుల వ్యక్తిత్వాలు
పురాతన గాథల పరిస్థితులు
పరిశీలించి వాస్తవంగా చూస్తే గానీ
పరిశ్రమించి నిర్మించగలం–
వారసులకి వంతెన!!

–వారణాసి రామకృష్ణ